# అజ్ఞాతశవం

-సయ్యద్ ఖుర్షీద్



గదిలోని ప్రశాంతతను భంగం చేస్తూ, మ్రోగింది ఫోన్. విసుగ్గా రిసీవర్ అందుకున్నాడతడు.

"హలో... పోలీస్టేషన్?!...." అవతలి కంఠంలో అందోళన.

"యస్.... విషయమేంటి?...." మామూలుగా అడిగినా గర్జన లానే ఉంది ఎస్సై స్వరం.

"సార్.... ఊరి చివర ఉన్న లక్ష్మీ గ్రెనెట్స్ దగ్గర ఒక మనిషి చచ్చిపడి ఉన్నాడు సార్...."

"ఇంతకీ నువ్వెవరు?"

"లక్ష్మీ గ్రెనెట్స్ ఓనర్ సుబ్బరాజుని సార్...."

"సరే! మేమొచ్చేంత వరకు శవం దగ్గరకు ఎవర్నీ రానీయకు! నువ్వు అక్కడే ఉండూ....." అంటూ ఫోన్ పెట్టేశాడు ఎస్సై.


❀ ❀ ❀

లక్ష్మీ గ్రెనెట్స్‌కు కొద్ది దూరంలోనే ఒక శవం పడి ఉంది. ఊరి చివర కనుక ఎవరికీ యింకా తెలియనట్టుంది.

జీపు శబ్దానికి పరుగెత్తుకుంటూ వచ్చాడు సుబ్బరాజు. ఎస్సైని పరిచయం చేసుకున్నాడు. ఊం కొడ్తూనే శవం దగ్గరకు వెళ్ళాడు ఎస్సై!

❀ ❀ ❀

అయిదడుగుల పొడవు, పొడవుకు తగ్గ లావు. ముప్పై లోపే ఉంటుంది వయస్సు. ముఖ కవళికలు



స్పష్టంగా కనిపించడం లేదు, ముక్కు నుదురు, పెదాలపై, చెంపలపై గాయాలున్నాయి. ఎవరో తీవ్రంగా కొట్టి చంపినట్లుంది.

తదుపరి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయిస్తూనే ఆలోచించసాగాడు ఎస్సై! రూపు రేఖలు ఎక్కడో చూసినట్టుంది. కొంపతీసి ఈ ప్రాంతంలో సంచరించే నక్సల్ సురేష్ కాదుకదా?! అలా అనుకోవడమే ఆలస్యం, ఒక నిర్ణయానికొచ్చేశాడు. తననుకున్నట్లు జరిగితే, తన పదవీ పద సోపానంలో ఈ శవం ఒక సాధనమవుతుందని మనసులో నిర్ణయించుకున్నాడు. ఎన్‌కౌంటర్ కథనానికి ఆలోచనలు చేయసాగాడు.

❀ ❀ ❀

"మన పార్టీ కార్యక్రమాలు ఈమధ్య చల్లబడ్డాయి. ఇలా అయితే రేపు రాబోయే ఎన్నికల్లో మనకు కష్టమే!" అన్నాడు చలపతి.

"అవును.... స్తబ్దతను వదిలి ఏదైనా చేయక పోతే మనవాళ్ళకు ఎన్నికల్లో ఇబ్బందులు తప్ప వేమో?!" తన అభిప్రాయం చెప్పాడు సుధాకర్.

ఇద్దరి అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్లు మిగిలిన వారంతా మౌనంగా తమ తమ ఆలోచనల్లో పడిపోయారు.

అంతలో రంగన్న అక్కడికి చేరుకున్నాడు. చలపతికి నమ్మిన బంటు అతడు. సరాసరి చలపతి చెవిలో ఏదో చెప్పి, తన పనయిపోయినట్లు వెళ్ళిపోయాడు. చలపతి మొఖం ఆనందంతో వికసించింది.

"ఫ్రెండ్స్! నేనొక విషయం చెప్పబోతున్నాను. దాన్ని జాగ్రత్తగా ఆచరిస్తే, ఈసారి మనం తప్పక సక్సెస్ కాగలం...." ఉత్సాహంగా చెప్పుకుంటూ పోతున్నాడు.

"సార్! చలపతి వాళ్ళ గ్యాంగ్ లక్ష్మీ గ్రినెట్స్ దగ్గరికి ఊరేగింపుగా వచ్చి గొడవ చేస్తున్నారట. ఇప్పుడే మన పి.సి. ఫోన్ చేసి చెప్పాడు," స్టేషన్‌లోకి అడుగుపెడ్తున్న ఎస్సైతో అన్నాడు స్టేషన్‌లో డ్యూటీలో ఉన్న రాములు.

"అలాగా!...." ఆలోచనలో పడ్డాడు ఎస్సై. తన పథకం బెడిసి కొడ్తుందా? అనే సందేహం మొదటిసారి కలిగిందతనిలో. ఆలోచిస్తూనే

**ఆ ప్రయత్నం కావాలి!**

రాజేంద్రప్రసాద్ మళ్ళీ ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్నాడు. చిరంజీవితో, నాగార్జునతో సరిసమానమయిన పాత్రలు చేయడం మంచిదే. అయితే రాజేంద్రప్రసాద్‌ని ప్రేక్షకులు ఊహించుకొనేది నాన్‌స్టాప్‌నాన్సెన్స్ లాంటి సెంట్‌పర్సంట్ కామెడీ చిత్రాలల్లోని పాత్రల్ని. ఆ ప్రయత్నం అతను చేయాలి మరి!

బయటికొచ్చి బైక్‌ను లక్ష్మీ గ్రినెట్స్ వైపు పరుగులు తీయించాడు.

గ్రినెట్స్ దగ్గరికి చేరుకుంటూనే అధికార దర్పంతో గుమిగూడిన జనాన్ని గద్దించాడు.

"ఏంటి? గొడవ యిక్కడ. దూరం జరగండి. అసలేం జరుగుతోందిక్కడ మీరంతా గుమిగూడడానికి."

"అది మిమ్మల్ని అడగాల్సిన ప్రశ్న," చలపతి బదులిచ్చాడు.

"ఇక్కడేదో శవం ఉందని తెలిస్తే, మేం వచ్చాం. ఇంకా వివరాలేమీ తెలియలేదు." చలపతి గురించి తెల్సిన ఎస్సై సిన్సియర్‌గానే బదులిచ్చాడు.

"అయితే యితనెవరో మీకు తెలియదన్నమాట. మీ లాఠీ దెబ్బలకు యితను చావలేదన్నమాట. మీకేమీ తెలియదంటే మేమంతా నమ్మాలన్న మాట" వ్యంగ్యంగా ప్రశ్నల వర్షం కురిపించాడు చలపతి.

కొయ్యబారి పోవడం ఎస్సై వంతైంది. పవర్‌లోలేని చలపతిని తానింత కాలం పట్టించుకోలేదు కానీ, యిప్పుడిలా ఎదురు దెబ్బ తీస్తాడని ఊహించలేదు. తీక్షణంగా చలపతి వైపు చూశాడు.

"నేను చెప్పాల్సింది చెప్పాను. మిగిలిన విషయం దర్యాప్తులో తేలుతుంది. అనవసరంగా 'యిష్యూని' పెద్దగా చేయకండి" శాంతంగానే అన్నాడు.

"సరే! నేనూ చూస్తాను. యిలా మీరెంతమందిని పొట్టనపెట్టుకుంటారో? ప్రజా సమక్షంలోనే ఈ ప్రభుత్వం పోలీసుల సాయంతో చేస్తున్న దౌర్జన్యాలను ఎదుర్కుంటాను" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు చలపతి. అతని వెంటే అతని అనుచరులు కూడా నిష్క్రమించారు.

"ఈ వార్తను ఎలా కవర్ చేద్దామనుకుంటున్నావ్?" ప్రశ్నించాడు నవాబ్ తన కొలీగ్ భాస్కర్‌ను. వాళ్ళిద్దరూ వేర్వేరు పత్రికల్లో పనిచేసే విలేఖరులు. అప్పుడప్పుడు ఒకరినొకరు అలా సంప్రదించుకోవడం వారికలవాటు.

"ఏమంది!? యస్సై చెప్పిన విషయాలను యథా తథంగా వ్రాస్తే సరి!"

"మరి చలపతి అది పోలీసులు చేసిన హత్య అని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తానంటున్నాడు కదా?" నవాబ్ సందేహం వెలిబుచ్చాడు.

"ప్రెస్ మీట్‌లో చలపతి స్టేట్‌మెంట్‌ను కూడా యథాతథంగా వ్రాస్తే సరి! నిజానిజాలు దర్యాప్తులో తేలుతాయి" భాస్కర్ బదులిచ్చాడు.

"కేసు ఎలాగో అస్పష్టంగా ఉంది. మనం కూడా చిన్న జిమిక్ చేస్తే ఎలాగుంటుందంటావు?" అడిగాడు నవాబ్.

"ఏం చేస్తావేంటి?"

"చెప్పను. రేపు పేపర్‌లో చూడు. జనరల్ పేజీ ఐటంగా మారుస్తా. బైలైన్‌కి ట్రై చేస్తా" హుషారుగా చెప్పాడు.

ఆనందపేటలో ఆకలి చావు?

ఆనందపేట : సత్యదూత : మే 1 : స్థానిక లక్ష్మీ గ్రినెట్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతుని వయసు 30 సంవత్సరాలుంటుంది. చామన ఛాయ. అయితే ఇది హత్యా? ఆత్మహత్యా?? అన్నది ఇంకా తెలియలేదు. దర్యాప్తు కొనసాగుతోంది.

మృత దేహాన్ని పరిశీలించిన స్థానికులు మాత్రం యిది ఆకలి చావుగా అభిప్రాయ పడుతున్నారు. వరుసగా గత మూడు సంవత్సరాలుగా నెలకొన్న దుర్భరపరిస్థితులను తట్టుకోలేక జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆత్మహత్యలు జరుగుతున్న క్రమంలో యిది కూడా ఆ కోవకు చెందినదేనని అభిప్రాయపడుతున్నారు.

సత్యదూత పత్రికలో తన మిత్రుడు రాసిన వార్తా కథనాన్ని చదివిన భాస్కర్ కొయ్యబారి పోయాడు. పెద్ద పెద్ద అక్షరాలతో అతను రాసిన వార్తా కథనానికి ఇరుప్రక్కల ఎస్సై కథనం, చలపతి ప్రెస్‌మీట్ ఐటం ఉన్నాయి. అతను ఆశించినట్టు జనరల్ పేజీలో వార్త కవర్ అయింది కానీ, బైలైన్ దక్కలేదు. మనసులోనే మిత్రుడి తెలివిని మెచ్చుకుంటూ పేపర్‌ను ప్రక్కన పెట్టాడు భాస్కర్.

సరిగ్గా అదే సమయంలో.....

ప్రెస్ మీట్‌లో తన పేరు, తను చెప్పిన విషయం చక్కగా కవర్ అయినందుకు సంతోషిస్తూ, ఉద్యమానికి వ్యూహ రచన చేయడంలో మునిగిపోయాడు చలపతి.

తను చేసిన జిమ్మిక్ వల్ల జనరల్ పేజీలో తన వార్త కవర్ అయినందుకు ఆనందంతో తన రోజువారి పనిలో పడిపోయాడు నవాబ్.

చలపతి వల్ల తన పథకం బెడిసికొట్టినందుకు మనసులోనే అతన్ని తిట్టుకుంటూ సిన్సియర్‌గా దర్యాప్తుకు సిద్ధమైనాడు ఎస్సై.

అయితే....

ఇవేమీ పట్టనట్లు అలానే శూన్యంలోకి దృష్టినిలిపి ఉండిపోయిందా అజ్ఞాత శవం! ❋